batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

7 సెప్టెంబర్ 2026
సోమవారం

సాగునీటి కోసం

## మరో యుద్ధానికి సిద్ధం

రాష్ట్రంలో సాగునీరు, తాగునీటి సరఫరా పట్ల జరుగుతున్న అన్యాయంపై ఆగ్రహం
పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు

02






# పేరుకే మాతాశిశు సంరక్షణ కేంద్రం

స్టాఫ్ నియామకం లేదు

ఆర్థిక శాఖ అనుమతి లేదని నియామకాలు బంద్
వైద్య ఆరోగ్య సేవలపై తీవ్ర ప్రభావం
పట్టించుకునే వారే కరువు

02

నిజామాబాద్, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గల మాతాశిశు సంరక్షణ కేంద్రం ఎంసీహెచ్ ఇటీవల చర్చనీయాంశంగా మారింది. గత నెలలో నవజాత శిశువు మ-తదేహం ఆసుపత్రి ప్రక్కన ఉన్న డ్రైనేజీలో లభ్యమైంది. ఈ నెల 5న ఎంసీహెచ్ లో చికిత్స కోసం వచ్చిన గర్భిణీకి సంబంధించిన రెండవ కుమారుడిని చాక్లెట్ ఆశచూపి మహిళ ఎత్తుకెళ్లింది.పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 24 గంటల్లోనే బాలుడి కిడ్నాప్ కేసును చేదించి తల్లిదండ్రులకు అప్పగించడంతో బాలుడి మిస్సింగ్ కథ సుఖాంతమైంది. అయితే మాతాశిశు సంరక్షణ కేంద్రంలో వైద్యులు మినహా సిబ్బంది నియామకాలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందనే చర్చ జరుగుతుంది.కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఎంసీహెచ్ లో గైనిక్, పిడియాట్రిక్స్ వైద్యులు మినహా సిబ్బంది నియమించకపోవడంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (మెడికల్ కళాశాల అనుబంధ) నుంచి సిబ్బందిని కేటాయించుకుని విధులు నిర్వహిస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది.

జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో

## ఆర్ఐ కిరణ్ కుమార్ సస్పెండ్

డ్యూటీల కేటాయింపులో నిర్లక్ష్యం . . .
అవినీతి ఆరోపణలపై వేటు..!



జగిత్యాల, బతుకమ్మ : జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ అడ్మిన్ కిరణ్ కుమార్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. గత కొంతకాలంగా సిబ్బందికి డ్యూటీల కేటాయింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు కిరణ్ కుమార్‌పై వినిపిస్తున్నాయి. అంతేకాదు కొంతమంది సిబ్బందికి డ్యూటీలు ఇవ్వకుండా, వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కూడా తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ అనంతరం చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కిరణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీజు బకాయిల విడుదల కోసం

## చలో ఇందిరా పార్క్ ధర్నా విజయవంతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి



03

నర్స్ మృతిపై

## మేజిస్ట్రియల్ విచారణ

సీఎం రేవంత్ రెడ్డి



02

హైదరాబాద్, బతుకమ్మ :ఇటీవల హైదరాబాద్ శివార్లలోని తుక్కుగూడలో ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సు హత్యాచారానికి గురైన ఘటనను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనపై మెజిస్ట్రీరియల్ విచారణకు ఆదేశించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధితురాలు ఉంటున్న వసతి ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు, సంబంధిత సంస్థ నిర్వహణలో ఏమైనా నిర్లక్ష్యాలు ఉన్నాయా, మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించి పాటించాల్సిన నిబంధనలు అమలయ్యాయా అన్న అంశాలన్నింటినీ విచారణలో పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.




02

## బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- 24 గంటల్లోనే చేదించిన పోలీసులు
- చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగింత
- బాలుడిని ఎత్తుకెళ్లిన దంపతుల అరెస్టు



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం ప్రాంగణంలో జరిగిన చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. మూడు సంవత్సరాల బాలుడికి చాక్లెట్ ఆశచూపి ఎత్తుకెళ్లిన మహిళను, ఆమెకు సహకరించిన వ్యక్తిని పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేసి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య ఆదివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన మహిళ కాన్పు కోసం ఎంసీహెచ్ కు వచ్చింది.

# బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

తన ఇద్దరు పిల్లలను కుటుంబ సభ్యులు ఎంసీహెచ్ ప్రాంగణంలో ఉంచగా కాన్పు కోసం మహిళను లేబర్ రూంకు తరలించారు. బయట ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులలో చిన్న వాడైనా వేదాన్ష్(3) ను రంగారెడ్డి జిల్లా మేడ్చల్ నివాసులు అయిన కోతాడి సుజాత, కోతాడి ఎల్లం అనే వ్యక్తులు చాక్లెట్ ఆశచూపి ఎత్తుకెల్లారు. తన తమ్ముడిని మహిళ చాక్లెట్ ఇస్తానని తీసుకెళ్లిందని అతని సోదరుడు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు అప్రత్తమై 112 కు ఫోన్ చేసి సమాచారం అందించారు. నిజామాబాద్ 1వ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సీపీ ఆదేశాలతో సీసీఎస్, టెక్నికల్ టీంలు రంగంలోకి దిగి ఎంసీహెచ్ లో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా మహిళ వేదాన్ష్ ను తీసుకెళ్తున్న వీడియోలు స్పష్టంగా కనిపించాయి. వీడియోల ఆధారంగా రాష్ట్రపతి రోడ్డు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పరిశీలించారు. మహిళ చిన్నారిని తీసుకెళు న్న ద-శ్యాల ఆధారంగా సంగారెడ్డి జిల్లాలోని నిజాంపేట్ గ్రామంలో బాలుడిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా ఐదు సంవత్సరాల్లోపు పిల్లలను ఆరుబయట ఆడుకునేటప్పుడు, ఆసుపత్రులు, స్కూళ్ళ వద్ద, ప్రయాణ ప్రాంగణాల్లో జాగ్రత్త వహించాలని సూచించారు. 24 గంటల్లో బాలుడి కిడ్నాప్ కేసును చేదించిన 1వ టౌన్ ఎస్ హెచ్ వో రఘుపతి, సీసీఎస్ ఏసీపీ శ్రీశైలం ఆధ్వర్యంలోని టీం చాకచక్యంగా వ్యవహరించి సుఖాంతం చేసిందని వారిని సీపీ అభినందించారు.

# నర్స్ మృతి పై మేజిస్టీరియల్ విచారణ

ఈ కేసులో నిందితుడిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తు, ఫోరెన్సిక్ నివేదికలు, ఇతర సాంకేతిక ఆధారాల సేకరణను వీలైనంత వేగంగా పూర్తి చేసి సమగ్ర ఛార్జ్‌షీట్ దాఖలు చేసేలా పోలీసు ఉన్నతాధికారులు కేసును నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. ఈ కేసులో బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించాలని ఆదేశించారు. న్యాయశాఖ, పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి కేసు విచారణలో జాప్యం జరక్కుండా చూడాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం తరపున మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఘటనకు కారణమైన వ్యవస్థాపరమైన లోపాలను గుర్తించి సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా కేసు విచారణ పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# పేరుకే మాతాశిశు సంరక్షణ కేంద్రం

ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రిలో మాతాశిశు సంరక్షణ కేంద్రం ఉండాలని భారత వైద్య మండలి నిబంధనలో ఉంది. దానితో మెడికల్ కళాశాల ప్రభుత్వ ఆసుపత్రిలో 2013లో ప్రారంభం కాగా అనుబంధంగా ఎంసీహెచ్ ను నిర్మాణం మాత్రం నత్తనడకన సాగింది. 2025లో దానిని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాచేత ప్రారంభింపజేసి చేతులు దులుపుకున్నారు. డిపార్ట్ మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) నుంచి జరిగే నియామకాలకు ఆర్థిక శాఖ అనుమతించకపోవడంతో కేవలం వైద్యులు మాత్రమే కేటాయించడంతో జీజీహెచ్ నుంచి సిబ్బందికి అక్కడికి కేటాయించి పనులు చేస్తున్నారు. మంత్రి ప్రారంభించిన తర్వాత కూడా ఆర్థిక శాఖ అనుమతించలేదన్న కారణంతో దాదాపు ఆరు నెలలు ఎంసీహెచ్ కు తాళం పడింది. ఈ యేడాది ఆరు నెలల క్రితం హడావుడిగా జీజీహెచ్ లోని గైనిక్, పీడియాట్రిక్స్ విభాగాలను ఎంసీహెచ్ కు తరలించారు. కానీ నర్సింగ్ స్టాఫ్ , పేషెంట్ కేర్ సిబ్బంది, సెక్యూరిటీ, సానిటేషన్ ఉద్యోగులను నియమించలేదు. దానితో ఎంసీహెచ్ లో జీజీహెచ్ లో పని చేస్తున్న వారితోనే కాలం వెల్లదీస్తున్నారు. నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రిలో, ఎంసీహెచ్ లో సిబ్బంది కొరత ఉన్న పాలకులకు చీమకుట్టినట్లయిన లేదు. ఉత్తర తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైన మెడికల్ కళాశాల అనుబంధ ఆసుపత్రిలో నియామకాలు లేక గర్భిణీలకు, శిశువులకు వైద్య సేవలు అందక ప్రైవేట్ ను ఆశ్రయిస్తుంటే పాలకులు, అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రి డెవలప్ మెంట్ కమిటీ సమావేశంలోనూ తీర్మాణాలు చేసి ప్రభుత్వానికి పంపడం మినహా నియామకాల కోసం పట్టుబట్టి సిబ్బంది నియామకాలు చేయించడంలో విఫలమయ్యారన్న వాదనలున్నాయి. ఎంసీహెచ్ లో వైద్యులు మినహా సిబ్బంది లేకపోవడంతో గర్భిణీలకు, నవజాత శిశువులకు అత్యవసర సేవలను ప్రైవేట్ కు రిఫర్ చేయాల్సిన దుస్థితి దాపురించింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఎంసీహెచ్ లో సిబ్బంది లేక వైద్య సేవల్లో ఇబ్బందులు ఎదుర్కొంటే అధికారులు పట్టించుకున్న పరిస్థితి కనిపించడం లేదు. అప్పుడప్పుడు తనిఖీలు చేస్తున్నా అక్కడ వైద్య సేవల పరిస్థితుల్లో మా త్రం ఎలాంటి మార్పు రావడం లేదు. ఎంసీహెచ్ లో పేద కుటుంబాలకు చెందిన గర్భిణీలకు కానీ, చిన్నారులకు కానీ వైద్య సేవలకు ప్రైవేట్ వెళ్లాలి, లేకపోతే హైదరాబాద్ నిలోఫర్ కు రిఫర్ చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ సిబ్బంది అవసరం ఉండి నియామకాలు జరుగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనిపై పాలకులు, అధికార యంత్రాంగం చొరవ తీసుకుంటేనే ఎంసీహెచ్ లో పేదలకు నాణ్యమైన ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్యం అందే పరిస్థితి ఉంది

# 23న కోడంగల్ లో పాంచజన్య సంకల్ప సభ

## పోస్టర్ ఆవిష్కరించినతెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత



హైదరాబాద్, బతుకమ్మ : సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఫోకస్ చేశారు. ఈనెల 23న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నారు. సభ పోస్టర్ ను ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి హాఫ్ గ్యారంటీ కూడా అమలు చేయడం లేదని అన్నారు. బూటకపు హామీలు.. బోగస్ మాటల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై కొడంగల్ కేంద్రంగా పాంచజన్య శంఖారావం పూరిస్తున్నామని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడంతో పాటు తమ పాంచజన్యంలోని ప్రతి హామీని వంద శాతం నెరవేర్చి తీరుతామన్నారు. యువత, మహిళలు, సబ్బండ వర్గాల వికాసం, సాధికారత కలిగిన బహుజన తెలంగాణాను సాకారం చేయడమే తమ లక్ష్యమన్నారు.

### టీఆర్ఎస్ లోకి బీజేపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్ చార్జీ

బీజేపీ కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జీ ప్రభాకర్ కులకర్ణి తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఆదివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కులకర్ణితో పాటు ఆయన అనుచరులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. కవిత నాయకత్వంలో బహుజన తెలంగాణ సాధన కోసమే తాను టీఆర్ఎస్ లో చేరానని కులకర్ణి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అర్చనా సేనాపతి,గవినోళ్ల శ్రీనివాస్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి కోసం మరో యుద్ధానికి సిద్ధం

గజ్వేల్, బతుకమ్మ : తెలంగాణ ఉద్యమం సాగింది, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని తెచ్చుకున్నది సాగునీరు, తాగునీరు కోసమేననీ తెలంగాణకు జీవధార కాళేశ్వరం ప్రాజెక్టులపై చేసినవి దుష్ప్రచారాలనీ, కుట్రపూరితంగానే నీటిని ఎత్తిపోయడం లేదనే వాస్తవం ఎన్డీఎస్‌ఏ ప్రకటనతో స్పష్టమైపోయిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. సోమవారం నుండి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సంయుక్త సమావేశాన్ని ఆదివారం ఎర్రవెల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్ట్ జలాలను తెలంగాణ రైతాంగానికి అందకుండా పక్క రాష్ట్రం ఉపయోగించుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యిలా తొంభై శాతం పాలమూరు ప్రాజెక్టులు పూర్తిచేసినా, కృష్ణా జలాలను ఎత్తిపోసి నల్గొండ, పాలమూరు, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగునీరు, తాగునీటిని ఎందుకు అందించలేకపోతున్నారని ప్రశ్నించారు. మేడిగడ్డ దగ్గర చిన్న రిపేర్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే దాదాపు 13 జిల్లాల్లో రైతాంగం పంటలు పండించుకుంటారని, మరి ఎందుకు ఆ ప్రయత్నం చేస్తలేరో ప్రజలకు స్పష్టం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ నిలదీశారు. కాళేశ్వరంపై ఇదే పద్ధతిలో నిర్లక్ష్యం వహిస్తే, అన్యాయానికి గురవుతున్న రాష్ట్ర రైతాంగానికి సాగునీటి కోసం తానే స్వయంగా లక్షలాది మందితో కార్యాచరణ ప్రకటిస్తానని, సాగునీటి కోసం తిరిగి మరో యుద్ధానికి సిద్ధమౌదామని కేసీఆర్ పిలుపునిచ్చారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారంటీలను, హామీలను వెయ్యి రోజులైనా అమలు చేయడంలో ప్రభుత్వం ఎందుకు వైఫల్యం చెందిందో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనా వైఫల్యం మీద బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు విజయవంతం కావడం పట్ల అధినేత సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, పార్టీ ముఖ్యనేతలను, జిల్లా నాయకత్వాన్ని, కార్యకర్తలను పార్టీ అధ్యక్షులు కేసీఆర్ అభినందించారు.గ్రామాలు, పట్టణాల్లోని పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, పిల్లల వివాహాలు, దవాఖాన ఖర్చులు వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా తమ భూమిని అమ్ముకోవడానికి వీలు లేక ప్రజలు గోసపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య మీద ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని కేసీఆర్ స్పష్టం చేశారు.పాలిటెక్నిక్ విద్యను భ్రష్టు పట్టించే విధంగా జీవో 97ను తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని సభ్యులకు కేసీఆర్ స్పష్టం చేశారు. సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులు వృత్తి నైపుణ్యాన్ని సొంతం చేసుకుని భవిష్యత్తు ఉపాధిని సంపాదించుకుంటారని, అట్లా పలు రంగాలకు సంబంధించిన సాంకేతిక వృత్తి విద్యను అందించే పాలిటెక్నిక్‌ను స్వార్థ ప్రయోజనాల కోసం ఫణంగా పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలన్నారు. గోదావరి – కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు పేరుతో రాష్ట్రానికి తీవ్ర నష్టానికి ఒడిగడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఉభయ సభల్లో ప్రశ్నించాలన్నారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, శాంతిభద్రతల సమస్యల మీద రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిలదీయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, బీఆర్ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ మధుసూదనాచారి, శాసనసభాపక్ష ఉప నేతలు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మండలి ఉపనాయకులు ఎమ్మెల్సీలు ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఇతర పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో బతుకమ్మ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం



హైదరాబాద్, బతుకమ్మ : అక్టోబర్ 11న దుబాయ్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను నిర్వాహకులు ఆహ్వానించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దుబాయ్‌లో ఘనంగా నిర్వహించేందుకు గల్ఫ్ తెలంగాణ ఫోరమ్, ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఏర్పాట్లు చేస్తున్నాయి. జీటీఎఫ్ ఫౌండర్, అధ్యక్షుడు ఆకుల సురేందర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఆదివారం హైదరాబాద్ లోని కేటీఆర్ నివాసంలో కలిసి దుబాయ్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఆడపడుచులు,ప్రవాస తెలంగాణ కుటుంబాలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనాలని వారు కేటీఆర్‌ను ప్రత్యేకంగా కోరారు. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని గల్ఫ్ దేశాల్లోనూ కొనసాగించడంతో పాటు, అక్కడి తెలంగాణ సమాజంలో తమ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు జీటీఫ్?ప్రతినిధులు తెలిపారు. ముఖ్యంగా మహిళలు, యువత, చిన్నారులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, జయంత్ కుమార్, అభినవ్, ఆకుల కళ్యాణ్, లత తదితరులు పాల్గొన్నారు



## ఫీజు బకాయిల విడుదల కోసం

# చలో ఇందిరా పార్క్ ధర్నా విజయవంతం చేయాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్వహించనున్న చలో ఇందిరా పార్క్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని, బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న మొత్తం ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ ఎప్పటికీ పోరాటం చేస్తుందని, ప్రభుత్వం సమస్యను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని దినేష్ కులాచారి హెచ్చరించారు. ధర్నాకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగేనిజాంసాగర్ కింది భాగంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు విడుదల చేయాలని బీజేపీ రైతుల తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమస్యపై జిల్లా ఇంచార్జి కలెక్టర్‌ను కలిసి రైతుల సమస్యను వివరించడం జరిగిందన్నారు. అదే విదంగా మంత్రి ఉత్తమ్ కుమార్ కి కూడా లేఖ రాయడం జరిగిందన్నారు. బీజేపీ విజ్ఞప్తికి స్పందించి నీరు విడుదల చేసినందుకు జిల్లా ఇంచార్జి కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కొంత మంది ఒక్క లెటర్ రాయకున్నా మేము చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం నిజాంసాగర్ కింది భాగానికి నీరు విడుదల చేసినందున రేపు చేపట్టాల్సిన నిరాహార దీక్షను వాయిదా వేసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తులో మళ్లీ రైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు ఎదురైతే రైతుల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేవైఎం కో కోశాధికారి ఆమంద్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ?విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న రేపటి చలో ఇందిరా పార్క్ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం నిర్వహిస్తున్న ఈ పోరాటానికి జిల్లా నుంచి బీజేవైఎం నాయకులు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యార్థుల హక్కుల కోసం యువమోర్చా ముందుండి పోరాడుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఆమంద్ విజయ్ కృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకార్ లక్ష్మి నారాయణ, నాగోల్ల లక్ష్మి నారాయణ,మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బిలోజి నాయక్, మోర్చా అధ్యక్షులు పురుషోత్తం, బీసీ మోర్చా అధ్యక్షులు బొబ్బిలి వేణు గోపాల్, కిసాన్ మోర్చా అధ్యక్షులు తిరుపతి రెడ్డి, కార్పొరేటర్లు బెల్లల్ శశాంక్, గిరిబాబు, అర్జున్ రెడ్డి, రాకేష్, రాజ్ గణేష్, ఆనంద్, ఆనంద్ రావు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యాన్ని వీడీసీ విధిగా పట్టించుకోవాలి

### వీడీసీ చైర్మన్ ఇ. రమేష్



సిరికొండ, బతుకమ్మ :గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఏర్పడ్డ విలేజ్ డెవలప్మెంట్ కమిటీ (వీడీసీ)లు ఆయా గ్రామాల ప్రజల ఆరోగ్యాన్ని విధి పట్టించుకోని వైద్య శిబిరాలను నిర్వహించాలని రావుట్ల గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఇ. రమేష్ అన్నారు. ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో శ్రీ శివసాయి మల్టి స్పెషలిస్ట్ చిల్డ్రన్ హాస్పిటల్ సహకారంతో మెగా వైద్య శిభిరంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎన్ని డబ్బులు ఉన్న మనిషికి జబ్బులు ఉంటే పేదవాడేనాని, ప్రజలు ఆరోగ్యం పట్ల అవగాహనా పెంచుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ కోడిగేల రాజు, రిబ్బన్ కట్ చేసి మెగా క్యాంప్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో డిసిసి ప్రధాన కార్యదర్శి జి ఎర్రన్న, ఎం ఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ సూర్యనారాయణలు ప్రసంగించగా, ఉపసర్పంచ్ ఎస్. శ్రీనివాస్ గౌడ్, విడిసి సభ్యులు టీ రాజన్న, ఎం భాస్కర్, బీ కిషన్, రిక్క దామోదర్, ఎస్ కె సాధుల్ల, డి శశి, గట్టు సాయి, డి శేఖర్, పి దాస్, ఎస్ అభి, జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మంజీరలో అక్రమ ఇసుక తవ్వకాలు

### డోజర్ , బొలెరో పట్టివేత...



సాలురా, బతుకమ్మ : సాలురా మండలం తగ్గేల్లి మంజీర నది నుంచి రాత్రివేళల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ నవాజ్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి ఆర్ఐ శంకర్ మంజీర నదిలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న డోజర్, బోలెరోను అధికారులు పట్టుకున్నారు. అనంతరం తదుపరిచర్ల నిమిత్తం తహసిల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.



## గిరిరాజ్ కళాశాల లెక్చరర్లకు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డులు





ఇందూర్, బతుకమ్మ : రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు చెందిన డా.కె. రంజిత (కామర్స్), డా. రామకృష్ణ (భౌతిక శాస్త్రం)లకు తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులుగా అవార్డులు అందుకున్నట్లు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం కొడంగల్ లో జరిగిన రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో తెలంగాణ కళాశాల విద్య కమిషనర్ దేవసేన, తెలంగాణ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక ధృవ పత్రాలతో పాటు, జ్ఞాపికను, పదివేల చొప్పున పారితోషికంను అందుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గిరిరాజ్ కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు ఒకే సారి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా అవార్డు తీసుకోవడం విశేషమని, వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, టీయూ ఈసి మెంబర్ దండుస్వామి, పరీక్షల నియంత్రాధికారి భరత్ రాజ్, వినయ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ నహీదా బేగం, ఐక్యూఏ కోఆర్డినేటర్ రాజేష్, ఎన్సిసి అధికారి రామస్వామి, ఫిజికల్ డైరెక్టర్ బాలమణి, వివిధ విభాగాధిపతులు, రమేశ్ గౌడ్, ముత్తెన్న, చంద్రశేఖర్, జయప్రసాద్, వేణుగోపాల్, రాహుల్,ఉమాకిరణ్, అనసూయ, పూర్ణ చందర్ రావు, షేక్ చాంద్, ఏవో రామ్ కిషన్,సూపరిండెంట్ ఉదయ్ భాస్కర్, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బిఆర్ఎస్ పోరాటం





### మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో భారీ ఆటో ర్యాలీ...

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన, నెరవేర్చని హామీలకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా నిజామాబాద్ నగరంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ఆటో కార్మికులతో కలిసి ఈ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలన పూర్తిగా కుప్పకూలిందని, ప్రజా సమస్యలు తీవ్ర రూపం దాల్చాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన నిర్ణయాల వల్ల ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిని, వారి పొట్ట కొట్టే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ఆదాయం లేక నిత్యం తిండికి కూడా ఇబ్బందులు పడుతూ, పలువురు ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో సోదరులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు, నగరంలో పారిశుధ్య లోపాలపై బిఆర్ఎస్ నిరంతరం పోరాడుతోంద న్నారు. హైమది బజార్ లో నిర్మించిన నూతన మార్కెట్ దుర్గంధం తో అక్కడికి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే మహిళల సమస్యలపై ధర్నా ,బైక్ ర్యాలీలు నిర్వహించామని, నేడు ఆటో కార్మికులకు మద్దతుగా నేడు ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. నూతన ప్రభుత్వానికి ప్రజలు కొంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ వేచి చూశారని, కానీ 1000 రోజుల సమయం ఇచ్చినా కాంగ్రెస్ పాలనలో ఎలాంటి పురోగతి లేదన్నారు. తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే నిజమైన తెలంగాణవాది కేసీఆర్ మాత్రమేనని, రాబోయే రోజుల్లో మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలు కూడా స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12,000 ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఒక్కో ఆటో డ్రైవర్ కు రూ. 36,000 బాకీ పడిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఈ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగివచ్చి ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతు కిరణ్ శేఖర్, నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నాయకులు సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, చింతకాయల రాజు తదితరులు పాల్గొన్నారు.

# నిధులు నిల్... అభివృద్ధి సంక్షేమం కిల్

## రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఒట్టిబోయిన గ్రామాలు

### బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఆర్మూర్, బతుకమ్మ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి శనిలా దాపురించిన, పల్లెల ప్రగతికి నిధులు నిల్ అని, అభివృద్ధి . . . సంక్షేమం కిల్ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి 1000 రోజులు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను నట్టేట ముంచిన కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మాక్లూర్ మండల కేంద్రంలో పల్లెల్లో విధ్వంసం.. పడకేసిన పారిశుధ్యం అంశంపై నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ కాలసర్పం పల్లె ప్రగతిని కాటేస్తోందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో తెలంగాణ గ్రామాలు ఒట్టిబోతున్నట్లు ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ళ పాలనలో అభివృద్ధి జరగని పల్లె లేదు, సంక్షేమందని ఇల్లు లేదు అని జీవన్ రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో ప్రతీ ఇంట్లో సంక్షోభం, ప్రతీ కంట్లో విషాదం తాండవిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో గ్రామాలన్నీ ధనధాన్య రాసులతో నిత్యం సంక్రాంతి పండుగలా మెరిసి పోయాయన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో పల్లెలన్నీ




ఒట్టిబోయి కళావిహీనమయ్యాయని విమర్శించారు. రైతులు సాగునీటి జలాల పరవళ్ళు చాలా రోజులైంది. చెరువులు ఎండిపోతున్నాయి. చేపలు చచ్చిపోతున్నాయి. పల్లెల్లో చేతి వృత్తులు చావుకు దగ్గరవుతున్నాయి. రుణమాఫీ కాక, రైతు భరోసా నిధులు అందక, రైతు బీమా నిర్వీర్యమై, యూరియా దొరకక రైతు కుటుంబాలలో నిస్తేజం నెలకొంది ఫలితంగా పల్లెలు మరింత వన్నె తగ్గి గ్రామీణులంతా రేవంత్ రెడ్డి పోవాలి,?మళ్ళీ కేసీఆర్ రావాలి అని నినదిస్తున్నారు అని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో పల్లెల పరిస్థితి పూర్తిగా తారుమారైపోయిందన్నారు. పట్టించుకునే వారు లేక పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నాయన్నారు. నిధులు లేక పంచాయతీలకు




సమకూర్చిన ట్రాక్టర్లు మూలన పడ్డాయని, నడుస్తున్న వాహనాలకు సైతం చాలా వరకు రిపేర్లు ఉన్నాయని అన్నారు.తెలంగాణ పల్లెలు కేసీఆర్ హయాంలో ఆదర్శం.నేడు కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తనన్నారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే మిషన్ భగీరథ స్కీమ్ ను పూర్తిగా నిర్వీర్యం చేసే కుతంత్రం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికే 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాను కాంగ్రెస్ పాలకులు చంక నాకించారని, పల్లెల్లో కరెంట్ ఎప్పుడొస్తుందో ,ఎప్పుడూ పోతుందో తెలియని స్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీ ఛైర్మన్ విఠల్ రావు, సీనియర్ నాయకులు రాజారాం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఇందల్వాయిలో సీసీ కెమెరాల ఏర్పాటు



ఇందల్వాయి,బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో 5 సోలార్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచి లోకని గంగామణి గంగారం తెలిపారు, ఈ మేరకు ఆదివారం ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు, గ్రామంలోని ఐదు ప్రధాన విధులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా గ్రామంలో జరుగుతున్న దొంగతనాలు అసాంఘిక కార్యక్రమాలను నివారించడానికి సీసీ కెమెరాలు ఎంతో కృషి చేస్తాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు, గ్రామంలోని యువత చెడు మార్గంలో ప్రయాణించకుండా సీసీ కెమెరాలు ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మెదడుకోవాలన్నారు, ఒక్కో సిసి కెమెరా వెయ్యి మంది పోలీసులతో సమానమని ఈ సందర్భంగా సర్పంచ్ గంగమ్మని గంగారం గుర్తు చేశారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తో పాటు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి భరత్ కుమార్, కారోబార్ పోచయ్య, గ్రామ ఎలక్ట్రీషన్ మాదరి గంగారం తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్...

రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : రుద్రూర్ మండలంలోని అక్బర్ నగర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త మతిన్ అనే కార్యకర్తకు ఇటీవల యాక్సిడెంట్ కావడంతో ఆదివారం బాన్సువాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బాజీరెడ్డి వారి ఇంటి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. ఆయన వెంట బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ షేక్ ఏజాజ్, రుద్రూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ గాండ్ల మధు, బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు జువ్వల శ్రావణ్, సాయా గౌడ్, వీరన్న, వార్డు మెంబర్ శివకుమార్, ఆసిఫ్, కిజర్, జిశాన్, అజ్మీర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



### తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే

# కేసిఆర్ నాయకత్వం అవసరం..

### - కాంగ్రెస్, బీజేపి పార్టీల నుండి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు...





రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే కేసిఆర్ నాయకత్వం ఎంతో అవసరమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి రవి కిరణ్ అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి రవి కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుండి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. బీజేపి పార్టీ నుండి రుద్రూర్ మండలం బొప్పాపూర్ గ్రామ అధ్యక్షులు నారోజి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నుండి తగ్గెల్లి కిరణ్, బొమ్మిడి పాపయ్యలు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి రవికిరణ్ వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రవికిరణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే, గ్రామాల్లో రైతుల జీవితాల్లో వెలుగులు నిండాలంటే కేసీఆర్ నాయకత్వం ఎంతో అవసరమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందించారాని, కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిరిగాది శేఖర్, నితిన్ పటేల్, నరేందర్, సాయిలు, యువజన నాయకులు జువ్వల శ్రావణ్, టింకు గౌడ్, సుమన్, గుండ్ల మధు, పట్ల శ్రీకాంత్, పట్ల సంతోష్ పటేల్, సయ్యద్ కిజర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 7వ తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

### 29 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి ఆత్మీయంగా పలకరింపులు

కామారెడ్డి, బతుకమ్మ : 1996--97 విద్యా సంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. లింగంపేట్ మండలంలోని నల్లమడుగు గ్రామ పాఠశాలలో ఏడవ తరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు 29 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థులు, ఉపాధ్యాయులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకొని తమ విద్యాభ్యాసం, అప్పటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ప్రస్తుతం ఎవరెవరు ఏ పరిస్థితుల్లో ఉన్నారో తెలుసుకుని సైతం ఆనందాన్ని వ్యక్తం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ స్నేహబంధాన్ని మరోసారి చాటుకున్నారు. 29 ఏళ్ల అనంతరం జరిగిన ఈ అపూర్వ సమ్మేళనం అందరిలో ఆనందాన్ని నింపింది.



## కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను చూసి

# ఓర్వలేక బిఆర్ఎస్ ఆరోపణలు..

### అభివృద్ధి అంటేనే కాంగ్రెస్ తోనే సాధ్యం

### జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పొలసాని శ్రీనివాస్..



ఇందల్వాయి,బతుకమ్మ :కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి అని గత వెయ్యి రోజుల పాలనలో నిరూపించుకున్నాడని అది కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ చొరవతో సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోలసాని శ్రీనివాస్ స్పష్టం చేశారు, ఈ మేరకు ఆయన డిచ్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబర్ సింగ్ రాథోడ్ తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు, కేవలం టిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీపై బురద చల్లి మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తుందని ఆరోపించారుఅలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ బిఆర్ ఎస్ పార్టీ పది ఏళ్లుగా అధికారంలో ఉండి ఏం సాధించక ప్రజలను దోచుకుందని కేవలం పామ్ హౌస్ కే వాళ్ళ పాలన పరిమితమైంద న్నారు .కేసీఆర్ లక్షల కోట్ల అప్పు చేశాడని ఆరోపించారు. అప్పులు తీర్చడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఎంతో అభివృద్ధి సాధించి ప్రజల సంక్షేమం కొరకు పాటుపడుతున్నాడని అన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ 2034 వరకు అధికారంలో ఉంటుందని ఇది గమనించి బి ఆర్ఎస్ పార్టీ వాళ్లు భయపడుతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రము ఇచ్చింది సోనియా గాంధీ. రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నాయకత్వం మరియు రూరల్ శాసనసభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని డిచ్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంబర్ సింగ్ రాథోడ్ అన్నారు. పారదర్శకమైన పాలన అందిస్తూ అన్ని వర్గాల వారికి అన్ని పార్టీల వారికి ఇంద్రమ్మ ఇల్లు పెన్షన్లు ఉచిత విద్యుత్తు రైతు భరోసా కల్యాణ లక్ష్మి పథకాలు నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దేనాన్ని అన్నారు.. ప్రజలు గమనిస్తున్నారని ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆదరిస్తున్న విషయం చూసి బి.ఆర్ఎస్ పార్టీ ఓర్వలేకపోతుంద ని అన్నారు.డిచ్పల్లి సింగిల్ విండో చైర్మన్ రామచంద్ర గౌడ్ మాట్లాడుతూ వెయ్యి రోజుల పాలన ప్రజల సౌకర్యం కోసం నిరంతరం పథకాలు అందిస్తూ ప్రజలకు చేరువవుతుండగా రాష్ట్ర ముఖ్యమంత్రిపై నిందలు వేయడం కాంగ్రెస్ పార్టీని బురద జల్లడమే పనిగా బి ఆర్ఎస్ పార్టీమసలు తోందని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ప్రజలు ఆదరిస్తున్నారని మళ్ళీ 2034 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీసి జిల్లా కార్యదర్శి డాక్టర్ సాదుల్లా, డాక్టర్ జహూర్, బూససుదర్శన్ నడిపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు అమీర్, సురేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, సతీష్ రెడ్డి, శక్కరి కొండ సాగర్, సర్పంచులు రాహుల్ సింగ్, లక్ష్మణ్ నాయకులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## భవిష్యత్ కార్యాచరణకే టీయుసీఐ స్టేట్ కౌన్సిల్ మీటింగ్

### స్టేట్ టీయుసీఐ నాయకులు ఆర్. రమేష్



సిరికొండ, బతుకమ్మ : దేశ వ్యాప్తంగా ఇది వరకు జరిగిన ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయుసీఐ) నిర్వహించిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్ ఉద్యమ కర్తవ్యంను, ఉద్యమ ప్రణాళికలను రూపొందించేందుకే టీయుసీఐ స్టేట్ కౌన్సిల్ మీటింగ్ ను నిర్వహించుకోవడం జరుగుతుందని స్టేట్ టీయుసీఐ నాయకులు ఆర్. రమేష్ అన్నారు. ఖమ్మంలో ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా(టీయుసీఐ) నిర్వహిస్తున్న స్టేట్ కౌన్సిల్ మీటింగ్ కు ఆదివారం మండల కార్మిక నేతలు వాహనాలపై తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ట్రేడ్ యూనియన్ రంగంలో టియుసిఐ బలమైన కార్మిక సంఘం గా నిలిచిందని ఆయన తెలిపారు . దేశంలో మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక, నిరంకుశ విధానాలపై బలమైన పోరాటాలను నిర్మించడానికి ఉద్యమ పోరాటాలను రూపొందించుకోవడం జరుగుతోందన్నారు.జనరల్ కౌన్సిల్ కు వెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షులు ఎం ముత్తేన్న, ఉపాధ్యక్షులు కె రాజేశ్వర్, వి సత్తేవ్వ, ఏ ప్రకాష్, సహాయ కార్యదర్శి ఎస్ కిషోర్, కోశాధికారి జి అరవింద్, నాయకులు ఓ ఆశన్న తదితరులు ఉన్నారు.




## ఏఆర్పీ క్యాంపులో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

### గురువుల ఆశీస్సులు... మిత్రుల ఆత్మీయ ఆలింగనాలు... బాల్య జ్ఞాపకాలతో పండుగలా మారిన పాఠశాల ప్రాంగణం



ఎడపల్లి, బతుకమ్మ : ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంపులోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరు దశాబ్దాలకు పైగా కాలం గడిచినా చెదరని స్నేహబంధాలు, మరువని గురుభక్తి, మదిలో పదిలంగా నిలిచిన బాల్య జ్ఞాపకాలు ఒకే వేదికపై ఆవిష్కృతమయ్యాయి. సుమారు 65 సంవత్సరాల పదో తరగతి బ్యాచుల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హాజరై పాఠశాల ప్రాంగణాన్ని పండుగ వాతావరణంలో ముంచెత్తారు.వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా తరలివచ్చి తమ చిన్ననాటి మిత్రులను కలుసుకున్నారు. దశాబ్దాల తర్వాత ఒకరినొకరు చూసుకున్న వారు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల రోజులు, అప్పటి ఆటలు, స్నేహాలు, గురువుల బోధనలు, గ్రామీణ జీవన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పలువురు భావోద్వేగానికి లోనయ్యారు. 65 సంవత్సరాల పదో తరగతి బ్యాచుల పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా ఒకే చోట కలుసుకోవడం అరుదైన ఘట్టమని పలువురు పేర్కొన్నారు. కాలం మారినా స్నేహం మారదని, పాఠశాల అనుబంధం జీవితాంతం నిలిచిపోతుందని ఈ సమ్మేళనం చాటిచెప్పింది. చదువుకున్న పాఠశాల, చిన్ననాటి స్నేహితులు, అప్పటి గురువులు, గ్రామీణ జీవన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు పరస్పరం ఆత్మీయంగా ముచ్చటించారు. కొందరు తమ అనుభవాలను పంచుకోగా, మరికొందరు పాత ఫొటోలు, జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకున్నారు.



### గంగ తెప్ప మహోత్సవంలో పాల్గొన్న

## తోర్తి గంగపుత్ర సంఘు సభ్యులు



బతుకమ్మ,ఏర్గట్ల: ట్యాంక్‌బండ్‌లోని హుస్సేన్‌సాగర్ తీరంలో నిర్వహించిన గంగ తెప్ప మహోత్సవంలో తోర్తి గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నట్లు సంఘం అధ్యక్షుడు తొపారం రాజేశ్వర్ తెలిపారు.ఇట్టి సందర్భంలో అధ్యక్షుడు తోపారం రాజేశ్వర్ మాట్లాడుతూ గంగపుత్రుల సంప్రదాయాలు,సంస్కృతి, ఐక్యతను చాటేలా నిర్వహించిన ఈ మహోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి గంగపుత్ర సంఘాల సభ్యులు పాల్గొన్నారని తెలిపారు.ఈ సందర్భంగా తోర్తి గంగపుత్ర సంఘం సభ్యులు ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంఘం సభ్యులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. గంగపుత్రుల సంప్రదాయాలను కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలను సంఘ సభ్యులు ఐక్యతతో నిర్వహించడం అభినందనీయమని సంఘ సభ్యుడు తొపారం రాజేష్ పేర్కొన్నారు.

### భీంగల్ లో జరిగే కాంగ్రెస్ పార్టీ విజయోత్సవ సంబరాలకు

## ఏర్గట్ల కాంగ్రెస్ కార్యకర్తలు



బతుకమ్మ,ఏర్గట్ల; భీంగల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రజా సంక్షేమ పథకాల విజయోత్సవ సంబరాలకు ఏర్గట్ల మండల కేంద్రం నుండి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివన్నోళ్ళ శివకుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీతో బయలుదేరడం జరిగింది. ముందుగా ఏర్గట్ల మండల కేంద్రంలో డీజే ను సమకూర్చుకొని 1000 రోజులు కావస్తున్న శుభ సందర్భంగా టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంచుకొని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మరియు ఏర్గట్ల గ్రామంలో పలు విధుల గుండా బైక్ లతో ర్యాలీగా భీంగల్ లో జరిగే రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రజల సంక్షేమం విజయోత్సవ సంబరాలకు బయలుదేరడం జరిగింది.

### ఓటరు జాబితాలో వివరాలను

## సక్రమంగా నమోదు చేయాలి..

### – ఆర్డీవో రవీందర్ రెడ్డి..



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : ఓటరు జాబితాలో వివరాలను సక్రమంగా నమోదు చేయాలని బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి బీఎల్వోలకు సూచించారు. ఆదివారం రుద్రూర్ మండల కేంద్రంలో ఆర్డీవో రవీందర్ రెడ్డి పర్యటించి బీఎల్వోలకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన అర్హులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఫారం-6, ఓటరు నమోదు ప్రక్రియలో సవరణలకు ఫారం-8 సమర్పించాలని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ తారాబాయి, బిఎల్వోలు సునంద, రూప, పద్మ తదితరులు ఉన్నారు.

# అన్ని కుల సంఘాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత






### మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కేవలం ఆర్యవైశ్య సమాజానికే కాకుండా నిజామాబాద్ పట్టణంలోని అన్ని కుల సంఘాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇచ్చానని గణేష్ బిగాల తెలిపారు. ఆదివారం వినాయక ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం తన ఎమ్మెల్యే పదవీకాలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వినాయక ఆర్యవైశ్య సంఘానికి రూ.5,10,15 లక్షల నిధులు అందించామని గణేష్ బిగాల తెలిపారు. అదనంగా మరో రూ.5 లక్షల నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిజామాబాద్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆర్యవైశ్య సంఘాల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం భవనం నిర్మాణానికి సుమారు రూ.1.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని గణేష్ బిగాల తెలిపారు. ఆర్యవైశ్య సమాజానికి ఒక శాశ్వత వేదిక ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. అలాగే మాణిక్ భవన్ పాఠశాల అభివృద్ధికి కూడా నిధులు అందించినట్లు వెల్లడించారు. ఆర్యవైశ్య సమాజానికి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాజకీయంగా కూడా తగిన ప్రాధాన్యత ఇచ్చామని గణేష్ బిగాల అన్నారు. వైశ్య సమాజానికి చెందిన నాయకులు, కార్యకర్తలకు వివిధ సందర్భాల్లో నామినేటెడ్ పోస్టులు ఇచ్చామన్నారు."మన వాడు అధికారంలో ఉంటే మన సమస్యలు, మన అభివృద్ధి గురించి మరింత బలంగా మాట్లాడే అవకాశం ఉంటుందని, మన సమాజం నుంచి నాయకత్వం ఎదగాలి" అనే ఉద్దేశంతో ఆర్యవైశ్యులకు రాజకీయంగా ప్రోత్సాహం అందించామని ఆయన పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘాలతో పాటు యాదవ, మున్నూరు కాపు, ముదిరాజ్, పద్మశాలి తదితర కుల సంఘాలకు కూడా నిధులు అందించి వారి సామాజిక అవసరాలకు అండగా నిలిచామని చెప్పారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి సమాజం అభివృద్ధి చెందితేనే నిజామాబాద్ పట్టణం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తాను నమ్ముతానని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో మళ్లీ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామిగా నిజామాబాద్‌కు సేవ చేసే అవకాశం తనకు వస్తే, మొట్టమొదటగా వినాయక్ నగర్ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి నిధులు అందిస్తానని గణేష్ బిగాల హామీ ఇచ్చారు. ఆర్యవైశ్య సమాజం తనపై చూపిన ప్రేమ, అభిమానం ఎప్పటికీ మరువలేనని ఆయన అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షులు మామిడి రాజేందర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి నంగునూరి శ్రీనివాస్ గుప్తా (వాసు),కోశాధికారి అల్లా నగేష్ గుప్తా, కార్యవర్గ సభ్యులు సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సమాజ సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, నూతన కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు, సభ్యులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు మోటాడిరెడ్డి సంఘ సన్మానం



నిజామాబాద్ ప్రతినిధి, బతుకమ్మ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని ఇందూరు మోటాడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమం ను ఆదివారం నిర్వహించారు. ఇందూరు మోటాడిరెడ్డి సంఘ భవనంలో జిల్లా మోటాడిరెడ్డి సంఘ నేతృత్వంలో దావ మల్లికార్జున్ రెడ్డి సహకారంతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సామాజిక సన్మాన కార్యక్రమంలో భాగంగా మోటాడి సామాజిక వర్గానికి చెందిన ఉపధ్యాయులను శాలువాలతో, పుష్పగుచ్చలనిచ్చి సత్కరించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులకు విద్యాబోధన చేయడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తూ భావి తరాలను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గౌరవించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. "ఒక మంచి సమాజ నిర్మాణానికి పునాది విద్య.. ఆ విద్యకు దిశానిర్దేశం చేసే వ్యక్తి ఉపాధ్యాయుడు" అని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారు అందించే జ్ఞానం, మార్గదర్శకత్వం ఎన్నో తరాల భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని అన్నారు.
ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించే వారే కాకుండా.. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి ప్రతిభను గుర్తించి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే మార్గదర్శకులని కొనియాడారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివని తెలిపారు.
ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారికి గౌరవం అందించడం పట్ల సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి స్పాన్సర్‌షిప్‌తో కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల సంఘ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.
ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఇతరులకు కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, సన్మానం పొందిన ఉపాధ్యాయులు తమను గుర్తించి గౌరవించినందుకు మోటాటి రెడ్డి సంఘం ఇందూరు సభ్యులకు, స్పాన్సర్ మల్లికార్జున్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.
ఉపాధ్యాయులను గౌరవించడం అంటే విద్యను, జ్ఞానాన్ని, భవిష్యత్ తరాలను గౌరవించడమే అనే సందేశాన్ని చాటిచెప్పేలా ఈ సన్మాన కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మిస్టర్ డీజీపీ . . . నన్ను అసభ్యంగా కామెంట్ చేసిన పోలీస్ ను అరెస్ట్ చేయు

### తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ , బతుకమ్మ :
తనపై అసభ్యకరంగా కామెంట్లు చేసిన కానిస్టేబుల్ ను రాష్ట్ర డీజీపీ కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవటంపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా కేసు పెట్టకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. అసలు పరీక్ష పాసయ్యే ఆయన డీజీపీ అయ్యారా? ఆయనకు చట్టం తెలుసా అని కవిత నిలదీశారు. వెంటనే కానిస్టేబుల్ పై చర్యలు చేపట్టకుంటే అంతర్జాతీయ వేదికల్లో ప్రభుత్వం పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. అధికారం కోసం రేవంత్ రెడ్డి ఉద్యమకారులను వాడుకొని మోసం చేశాడనీ కవిత అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో వారికి నిర్ణీత కాల వ్యవధితో కూడిన స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో తనను అసభ్యంగా దూషించిన కానిస్టేబుల్ పై వెంటనే చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అంత అసభ్యంగా కామెంట్లు చేసిన వ్యక్తిని కేవలం సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటారా అని ప్రశ్నించారు. అతనిపై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మీకు కూడా ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిని కూడా ఇలాగే కామెంట్లు చేస్తే వదిలేస్తారా అంటూ కవిత అడిగారు. ఈ విషయంలో డీజీపీ బాధ్యత లేకుండా సెన్సిబులిటీ లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడారు. వెంటనే కానిస్టేబుల్ పై కేసు పెట్టి చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ వేదికల్లో ప్రభుత్వం పరువు తీస్తానని కవిత హెచ్చరించారు. అధికారంలోకి రావటానికి తెలంగాణ ఉద్యమకారులను రేవంత్ రెడ్డి ఉపయోగించుకున్నారని కవిత అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అసలు తెలంగాణ ఉద్యమంతో సంబంధమే లేని రేవంత్ రెడ్డి ఉద్యమకారులు నమ్మలేదని కవిత అన్నారు. ఆయన పక్కన కోదండ రాం సర్ ను చూసి రేవంత్ రెడ్డిని నమ్మారన్నారు. తెలంగాణ జన సమితి తరఫున ఉద్యమకారులకు ఐటెంటీలు కార్డులు ఇచ్చిన కోదండ రాం సార్ వాటినే ఇప్పుడు ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వటం లేదో చెప్పాలన్నారు. రాష్ట్రంలో బీసీలను మోసం చేసిన పార్టీయే కాంగ్రెస్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించి వారి జనాభాను తక్కువ చేసి చూపిందే కాంగ్రెస్ పార్టీ అని కవిత గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినట్టే పెట్టి ఆ బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవటం లేదన్నారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీయే ఇప్పుడు కేంద్రంపై వంద రోజుల కార్యాచరణతో ఆందోళన చేస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. అటు అసెంబ్లీ ప్రజా సమస్యలు చర్చకు రాకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ లు నాటకాలు ఆడుతున్నాయంటూ కవిత విమర్శించారు.

